క్లుప్తంగా

'మాస్‌లైన్' పోస్టర్లు విడుదల



వాల్‌పోస్టర్లు విడుదల చేస్తున్న నాయకులు

సుజాతనగర్: మూడు విప్లవ పార్టీలు కలిసి సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్‌గా ఏర్పడనున్నాయని ప్రజాపంథా పార్టీ మండల కార్యదర్శి బానోత్ ధర్మా తెలిపారు. ఈ సందర్భంగా ఖమ్మంలో మార్చి 3 నుంచి జరగనున్న సభల పోస్టర్లను మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... సమాజ మార్పు కోసం అనేక త్యాగాలు చేసిన కమ్యూనిస్టు విప్లవకారులు.. ప్రజాసమస్యలపై పోరాటానికిగాను విలీనమవుతున్నాయని తెలిపారు.

నర్సరీలు తనిఖీ



చింతోనిచెలక నర్సరీలో పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

టేకులపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన నర్సరీలను మంగళవారం ఎంపీడీఓ గడదాసు రవీందర్‌రావు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వేసవిలో మొక్కలు ఎండిపోకుండాసిబ్బంది ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఎంపీఓ లక్ష్మీగణేష్ గాంధీ, ఉద్యోగులు కాలంగి శ్రీనివాస్, తిరుపతయ్య, సిద్ధాంతి చిట్టి, దీప్తి, రాజు, శ్రీహరి, శిరీష, కవిత, స్వప్న, వెంకటరమణ, భీముడు, బాలాజీ పాల్గొన్నారు.

పండ్లు, పులిహోర ప్యాకెట్లు పంపిణీ



పులిహోర ప్యాకెట్లు అందజేస్తున్న కృష్ణ

పాల్వంచ: పాల్వంచ బస్టాండ్ నుంచి మేడారం వెళ్లే ప్రయాణికుల సౌకర్యార్థం ప్రత్యేకంగా 45 ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేశారు. కాగా బస్సుల్లో విధులు నిర్వహిస్తున్న డ్రైవర్లు, కండక్టర్లు, బస్టాండ్ సిబ్బంది సుమారు 100 మందికి పాల్వంచ కృష్ణ ఫ్యాన్సీ యజమాని కృష్ణ దంపతులు పండ్లు, పులిహోర, పెరుగు అన్నం ప్యాకెట్లను మంగళవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో మధిర డిపో మేనేజర్ శంకర్, ఆర్టీసీ రిటైర్డ్ ఎస్ఎం ఇబ్రాయిల్, వర్తక సంఘం కన్వీనర్ చలవాది ప్రకాశ్, యడ్లపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వితరణ



దివ్యాంగుడికి సైకిల్‌ను అందజేస్తున్న దృశ్యం

సింగరేణి(కొత్తగూడెం): రామవరం వనందాసు గడ్డలోని దివ్యాంగుడు ఓదేలుకు కొంత మంది మిత్రులు కలిసి ఏర్పాటు చేసిన కృత్రిమ కాలును, మూడు చక్రాల సైకిల్‌ను ఐఎన్టీయూసీ కొత్తగూడెం ఏరియా ఉపాధ్యక్షుడు ఎండీ రజాక్ చేతుల మీదుగా మంగళవారం వితరణ చేశారు. కార్యక్రమంలో దబ్బెట గురుమూర్తి, మల్లారపు కొమరయ్య, సత్తార్‌పాష, శనిగరపు కుమార్, దాసరి అశోక్, ఎస్కే షమీమ్, రహీం, ఏడు కొండలు, రామారావు, శ్రీనువాస్ తదితరులు పాల్గొన్నారు.

'పది' విద్యార్థులకు అల్పాహారం



అల్పాహారం అందజేస్తున్న దృశ్యం

కొత్తగూడెంఅర్బన్: కూలీలైన్ ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ మేరకు స్థానికుడు వెంకటేశం పరీక్షల వరకు విద్యార్థులకు అల్పాహారం ఉచితంగా అందించేందుకు ముందుకొచ్చారు. మంగళవారం హెచ్ఎం కల్యాణశర్మ ఆధ్వర్యంలో విద్యార్థులకు అల్పాహారం అందించారు. ఈ సందర్భంగా హెచ్ఎం వెంకటేశంను అభినందించారు. కార్యక్రమంలో జమైతే ఇస్లామి హింద్ సభ్యులు షేక్ అబ్దుల్ బాసిత్, భరత్, క్రాంతి, సాల్విని, నాన్సీ, ఉపాధ్యాయులు ఊహ, అర్జున్, ఆజీమా, భాను తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి వనదేవతల జాతర

- ముస్తాబైన సమ్మక్క – సారలమ్మ గద్దెలు
- మేడారం వెళ్లలేని భక్తులకు కల్పతరువు
- ఆలయ కమిటీలు, సింగరేణి ఆధ్వర్యాన ఏర్పాట్లు పూర్తి



ఇల్లెందురూరల్: బొజ్జాయిగూడెంలో గద్దెల వద్ద పూజ చేస్తున్న భక్తులు

ఇల్లెందురూరల్: బొజ్జాయిగూడెం అటవీ ప్రాంతంలో సమ్మక్క, సారలమ్మ జాతర నేటి నుంచి ప్రారంభమవుతోంది. ఐదు దశాబ్దాలుగా ఇక్కడ మేడారంను తలపించే విధంగా భక్తిశ్రద్ధలతో కమిటీ ప్రతినిధులు జాతర నిర్వహిస్తున్నారు. క్రితం జాతరకు అంచనాలకు మించి భక్తులు తరలిరావడంతో ఇప్పుడు పోలీసుశాఖ ముందస్తుగా బందోబస్తు ప్రణాళిక రూపొందించింది. 21న సారలమ్మ, 22న సమ్మక్కను సమీపంలోని అటవీ ప్రాంతం నుంచి లక్షలాది మంది భక్తుల సమక్షంలో గద్దెల మీదకు చేరుస్తారు. ఈ సందర్భంగా గద్దెల సమీపంలో పెద్ద ఎత్తున స్టాల్స్ వెలిశాయి.

ముస్తాబైన జేకే నంది మేడారం...

ఇల్లెందు: ఇల్లెందు జేకే కాలనీ సంజయ్‌నగర్‌లో మినీ మేడారంగా పేరున్న నంది మేడారం జాతర బుధవారం ప్రారంభం కానుంది. ఇప్పటికే జాతర నిర్వాహక కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తిచేశారు. జాతరలో వీధిలైట్లు, తాగునీటి వసతి సింగరేణి సౌజన్యంతో ఏర్పాటు చేశారు. కాగా, బుధవారం నుంచి శనివారం వరకు జరిగే జాతరలో బుధవారం సంజయ్‌నగర్ కోర గుట్ట నుంచి సారలమ్మ తల్లిని, గురువారం కోరగుట్ట నుంచి సమ్మక్క తల్లిని గద్దెలపైకి తీసుకొస్తారని, అలాగే 23వ తేదీ శుక్రవారం భక్తులు మొక్కులు చెల్లించాక శనివారం తల్లులను తిరిగి వనానికి తరలిస్తారని జాతర నిర్వాహక ప్రతినిధులు తెలిపారు.

సుజాతనగర్: సుజాతనగర్ మండలం గరీబ్‌పేట పరిధిలో కొలువైన శ్రీ సమ్మక్క– సారలమ్మ వనదేవతల జాతర బుధవారం ప్రారంభం కానుంది. మినీ మేడారంగా ప్రసిద్ధి గాంచిన ఈ జాతరను 13 ఏళ్లుగా అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. జాతర నిర్వహణకు కమిటీ ఆధ్వర్యంలో బుధవారం నుంచి శనివారం వరకు జరిగే జాతర నిమిత్తం గద్దెలను ముస్తాబు చేశారు. 2009లో రామవరం ప్రాంతానికి చెందిన భక్తులు కోరిన కోర్కెలు నెరవేరడంతో సమ్మక్క– సారలమ్మ దేవతల మహిమతోనే ఇదంతా జరిగిందనంటూ ఇక్కడ పూజలు చేయడం ప్రారంభించారు. ఆ తర్వాత కొందరు కమిటీగా ఏర్పడి దేవతలకు గద్దెలు నిర్మించారు. అనంతరం ప్రతీ రెండేళ్లకోసారి జాతర ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ ప్రాంత ప్రజలు నిత్యం పూజలు చేస్తుండగా, రెండేళ్లకోసారి జరిగే జాతరకు మండల ప్రజలతో పాటు పరిసర ప్రాంతాల భక్తులు తరలివస్తారు. కాగా, బుధవారం సారలమ్మ, గురువారం సమ్మక్క దేవతలను గద్దెలపైకి తీసుకురానుండగా, శుక్రవారం భక్తులు మొక్కులు చెల్లించుకున్నాక శనివారం దేవతలు తిరిగి వనప్రవేశంతో జాతర ముగుస్తుంది.

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా పరిధిలోని గౌతంపూర్, రామవరం (2 ఇంక్‌లైన్‌వద్ద), గరీబ్‌పేట ప్రాంతాలలో ఈనెల 21 నుంచి 24 వరకు శ్రీశ్రీ సమ్మక్క– సారలమ్మ జాతర నిర్వహించేందుకు ఆయా కమిటీల ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేశారు. ఈనెల 21వ తేదీ సాయంత్రం ఆటపాటలతో, కొమ్ముడప్పులతో, దరువు చప్పుళ్లతో కోయ పూజారులచే సారలమ్మను గద్దెనెక్కిస్తారు. 22న సమ్మక్కను గరీబ్‌పేట గుట్ట వద్ద గల చిలకల గుట్ట నుంచి తీసుకొచ్చి గద్దెనెక్కిస్తారు. 24న అమ్మవారు తిరిగి వన ప్రవేశం చేయనున్నారు. భక్తులకు సింగరేణి సంస్థ అన్ని వసతులు ఏర్పాటు చేసింది.



సుజాతనగర్: గరీభ్‌పేటలో ముస్తాబైన గద్దెలు



ఇల్లెందు: జేకే నంది మేడారం ముఖద్వారం



సింగరేణి(కొత్తగూడెం): గరీబ్‌పేటలో...

చలో మేడారం..



మేడారం వెళ్లేందుకు బస్సు ఎక్కుతున్న ప్రయాణికులు

టేకులపల్లి: ఎక్కడ చూసినా మేడారం సమ్మక్క, సారక్క జాతర సందడే కనిపిస్తోంది. జాతరకు ప్రయాణికులు వెళ్లేందుకు ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశారు. టేకులపల్లి నుంచి ప్రయాణికులను మేడారం తీసుకెళ్లేందుకు ఆర్టీసీ నుంచి 25 బస్సులు ఏర్పాటు చేశారు. బస్సుకు సరిపడా ప్రయాణికులు ఉంటే గ్రామం వద్దకే బస్సుని పంపించే వెసులుబాటు కల్పించారు. ఆర్టీసీ ఇన్‌చార్జ్ పోరండ్ల రామనర్సయ్య, సహాయకులు గాడిపల్లి రవి, భూమిక టేకులపల్లిలోని ఆర్టీసీ క్యాంపులో విధులు నిర్వహిస్తున్నారు. ఇదిలా ఉండగా ఉమ్మడి ఖమ్మం జిల్లా రీజినల్ మేనేజర్ సీహెచ్ వెంకన్న టేకులపల్లిలోని మేడారం ఆర్టీసీ క్యాంపుని మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. బస్సుల వివరాలు తెలుసుకున్నారు.

విద్యార్థులు కష్టపడి చదవాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని

కొత్తగూడెంఅర్బన్: విద్యార్థులు కష్టపడి చదివి కళాశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకరావాలని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. మంగళవారం కొత్తగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాల వార్షికోత్సవ వేడుకలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కళాశాలకు కావాల్సిన నూతన బిల్డింగ్, కళాశాలలో సదుపాయల కోసం మంత్రితో మాట్లాడి ఏర్పాటుకు కృషి చేస్తానని తెలిపారు. అనంతరం వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ మాట్లాడుతూ.. తాను కళాశాల పూర్వ విద్యార్థి అన్నిరు. ఉన్నత స్థాయికి ఎదిగిన వారిని విద్యార్థులు ఆదర్శంగా తీసుకొని కష్టపడి చదువుకోవాలని చెప్పారు. ఇంటర్మీడియట్ నోడల్ అధికారి సులోచనారాణి, కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ సమస్య పరిష్కారానికి కృషి

సింగరేణి(కొత్తగూడెం): సీఎం రిలీఫ్ ఫండ్ దరఖాస్తుల సమర్పణలో జరిగిన జాప్యంపై ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించి ప్రతి లబ్ధిదారుడికి రిలీఫ్ ఫండ్ మంజూరు చేయాలని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు కోరారు. మంగళవారం కొత్తగూడెంలో లబ్ధిదారుల నుంచి సీఎం రిలీఫ్ ఫండ్ దరఖాస్తులు స్వీకరించారు. మాట్లాడుతూ.. రోగులు డిస్చార్జ్ అయిన తరువాత ఆరు నెలలలోపు దరఖాస్తు చేసుకోవాలనే నిబంధన ఉందని, చాలామంది సకాలంలో దరఖాస్తు చేసుకున్నప్పటికీ ఎన్నికల కోడ్ దృష్ట్యా స్వీకరణ నిలిచిపోవటంతో ఆరునెలల గడువు ముగిసిపోయిందన్నారు. దీనిపై ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించి ఆరు నెలల నిబంధన తొలగించాలని విజ్ఞప్తి చేశారు.

చదువులో రాణిస్తే ఉజ్వల భవిష్యత్



మాట్లాడుతున్న సత్యనారాయణరావు

సింగరేణి(కొత్తగూడెం): ఆటపాటలతో పాటు చదువులో రాణిస్తేనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని సింగరేణి డైరెక్టర్ ఈఅండ్ఎం సత్యనారాయణరావు అన్నారు. మంగళవారం కొత్తగూడెంలోని పోస్టాఫీస్ సెంటర్‌లోని సింగరేణి ఉన్నత పాఠశాల 48వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మాట్లాడుతూ... నేటి విద్యార్థులు చదువుపై ఆసక్తి కనబరుస్తున్నారన్నారు.

ఈ చదువు వారి భవిష్యత్‌కు బంగారు బాట అవుతుందని, కానీ కొంతమంది దీనిని విస్మరిస్తున్నారన్నారు. నేటి పోటీ ప్రపంచంలో ఈ చదువు ఒక్కటే సరిపోదని, ప్రతి అంశంపై పూర్తి పట్టు సాధిస్తేనే రాణిస్తారని లేదంటే నామమాత్రపు చదువుగా మిగిలిపోతుందన్నారు. ప్రణాళికతో చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సింగరేణి ఎడ్యుకేషన్ కరస్పాండెంట్ నికోలస్, హెచ్ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎంపీ, డీసీసీబీ చైర్మన్‌కు సన్మానం



వెంకటేశ్వరరావును సన్మానిస్తున్న కొత్వాల

పాల్వంచ: ఖమ్మం జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ (డీసీసీబీ) నూతన చైర్మన్‌గా దొండపాటి వెంకటేశ్వరరావు ఇటీవల బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు ఆయనకు మంగళవారం ఉమ్మడి జిల్లా కేంద్ర మార్కెటింగ్ సొసైటీ (డీసీఎంఎస్) వైస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా రైతు సమన్వయ సమితి మాజీ కన్వీనర్ నల్లమల్ల వెంకటేశ్వరరావు, బయ్యారం కోఆపరేటివ్ సొసైటీ చైర్మన్ మూల మధుకర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ యర్రంశెట్టి ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

సుజాతనగర్: రాజ్యసభ సభ్యుడిగా కాంగ్రెస్ పార్టీ తరఫున ఏకగ్రీవంగా ఎన్నికైన అనిల్ కుమార్ యాదవ్‌ను టీపీసీసీ సభ్యుడు నాగా సీతారాములు సన్మానించారు. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో మంగళవారం ఆయనను కలిసి పుష్పగుచ్ఛం అందించి సన్మానించారు.

ఆలయ పాలకవర్గానికి దరఖాస్తుల ఆహ్వానం

పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లి ఆలయ ప్రస్తుత ధర్మకర్తల మండలి కమిటీ పదవీ బాధ్యతలు మార్చిలో ముగియనున్నాయి. ఈ మేరకు నూతన ధర్మకర్తల మండలి కమిటీ నియామకం కోసం దరఖాస్తు చేసుకోవాలని ఈఓ ఎస్.రజనీకుమారి మంగళవారం నోటిఫికేషన్ జారీ చేశారు. కేశవాపురం, జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువై ఉన్న శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయ పాలక మండలి కమిటీ నియమాకం దేవాదాయ, ధర్మదాయశాఖ చట్టం ఆదేశాల ప్రకారం నియమించడం జరుగుతుంది. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ధర్మకర్తగా నియామకం కోసం నోటిఫికేషన్ వెలుబడిన తేది నుంచి 20 రోజుల లోపు దేవాదయ కమిషనర్ లేదా, ప్రాంతీయ సంయుక్త కమిషనర్ హైదరాబాద్ లేదా ఉప కమిషనర్ వరంగల్, ఖమ్మం సహాయ కమిషనర్లకు దరఖాస్తు చేసుకోవాలని ఈఓ పేర్కొన్నారు.

బాలోత్సవం బ్రోచర్లు ఆవిష్కరణ



బ్రోచర్లు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే, తదితరులు

కొత్తగూడెంరూరల్: జిల్లా కేంద్రంలోని సింగరేణి సీఈఆర్ క్లబ్‌లో ఈనెల 26 నుంచి 28వ తేదీ వరకు జరగనున్న తెలంగాణ బాలోత్సవం బ్రోచర్లను ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు బాలోత్సవం ఉపయోగపడుతుందని తెలిపారు. బాలోత్సవం కన్వీనర్ మద్దెల శివకుమార్, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్‌పాషా, ఎర్రంశెట్టి ముత్తయ్య, పొన్నం వెంకన్న, అందెల ఆనందరావు, కలవల చంద్రశేఖర్, అల్లి శంకర్, పన్నాలాల్, రాజేంద్రప్రసాద్, లాజరస్ తదితరులు పాల్గొన్నారు.

ఓవర్సీస్ పథకానికి దరఖాస్తు చేసుకోవాలి

కొత్తగూడెంఅర్బన్: విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసిస్తున్న మైనారిటీ విద్యార్థులకు మైనారిటీ సంక్షేమ శాఖ ద్వారా అందిస్తున్న సీఎం ఓవర్సీస్ పథకానికి దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మైనారిటీ అధ్యక్షుడు ఎండీ యాకూబ్‌పాషా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.5లక్షల లోపు కలిగి, 2023 ఆగష్టు – డిసెంబర్‌లో పోస్ట్ గ్రాడ్యుయేషన్, పీహెచ్‌డీలలో అడ్మిషన్లు పొందిన విద్యార్థులకు మాత్రమే అర్హులని పేర్కొన్నారు. మార్చి 20 లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని, హార్డ్ కాపీని ఏప్రిల్ 15లోపు జిల్లా మైనారిటీ కార్యాలయంలో సమర్పించాలని తెలిపారు. ఎంపికైన వారికి రూ.20 లక్షలు, విమాన చార్జీల నిమిత్తం రూ.60 వేలు అందిస్తారని పేర్కొన్నారు.

వాగులో చెత్త తొలగింపు



చెత్తను తొలగిస్తున్న జేసీబీ

సాక్షి ఎఫెక్ట్..

టేకులపల్లి: మండల కేంద్రంలోని శ్రీకోదండ రామాలయం ఎదురుగా ఉన్న ఇనుపమోరి వాగు చెత్తకుండీగా మారింది. పర్యవేక్షణ లేపోవడంతో చుట్టుపక్కల ప్రజలు చెత్త, చిరువ్యాపారులు వ్యర్థాలు తెచ్చి వాగులోనే వేస్తుండటంతో చెత్త పేరుకుపోయి నీటి ప్రవాహం నిలిచి దుర్గంధం వస్తోంది. ఈనెల 7 నుంచి 15 వరకు స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ నిర్వహించినప్పటికీ వాగును శుభ్రం చేయలేదని 'డంపింగ్ యార్డుగా మారిన వాగు'అనే శీర్షిన ఈనెల 18న సాక్షిలో ప్రత్యేక వార్తా కథనం ప్రచురితమైంది. దీనికి అధికారులు స్పందించారు. ఎంపీడీఓ రవీంద్రరావు, ఎంపీఓ గణేష్‌ల ఆదేశాల మేరకు కార్యదర్శులు ఎల్.కిరణ్, ప్రశాంత్‌లు యుద్ధ ప్రాతికపదికన మంగళవారం వాగును శుభ్రం చేయించారు. నీటి ప్రవాహం జరిగేలా చర్యలు తీసుకున్నారు. ఇకపై చెత్తను వాగులో వేయకుండా సమీపంలోని నివాసాలకు, దుకాణదారులకు నోటీసులు అందజేశారు.

టాలెంట్ టెస్ట్‌కు స్పందన



పరీక్ష రాస్తున్న విద్యార్థులు

జూలూరుపాడు: భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం , మంగళవారం నిర్వహించిన మండల స్థాయి టాలెంట్ టెస్ట్‌కు విద్యార్థుల నుంచి విశేష స్పందన లభించింది. పలు హైస్కూల్స్ విద్యార్థులు టాలెంట్ టెస్ట్ రాశారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి యాసా నరేష్ మాట్లాడుతూ.. 10వ తరగతి విద్యార్థులకు ఈ టాలెంట్ టెస్ట్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. విద్యార్థులు చదువులో రాణించి ఉన్నతశిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు.

'కేజీబీవీ' విద్యార్థినుల ప్రతిభ

కొత్తగూడెంఅర్బన్: ఇంగ్లిష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ (ఎల్టా) ఖమ్మంలోని ఎస్ఎస్బీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం నిర్వహించిన ఆంగ్ల డ్రామా ఉమ్మడి జిల్లా పోటీల్లో కేజీబీవీ అన్నపురెడ్డిపల్లి జట్టు విజేతగా నిలిచిందని ఎల్టా జిల్లా అధ్యక్షుడు షేక్ దస్తగిరి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 26న ఉమ్మడి జిల్లా తరఫున రాష్ట్ర స్థాయిలో పాల్గొంటారని తెలిపారు. జట్టుకు జిల్లా విద్యాధికారి వెంకటేశ్వరచారి, అసోసియేషన్ సభ్యులు అభినందనలు తెలిపారని పేర్కొన్నారు.

మార్చి 31లోగా పన్నులు చెల్లించండి

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలు మార్చి 31వ తేదీలోగా ఇంటి పన్నులు, నీటి పన్నులు, ట్రేడ్ లైసెన్స్ ఫీజులు చెల్లించాలని మున్సిపల్ కమిషనర్ శేషాంజనస్వామి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ కార్యాలయం, మీ–సేవా, కార్యాలయం బిల్ కలెక్టర్, ఆన్‌లైన్‌లో కానీ చెల్లించవచ్చని పేర్కొన్నారు. పన్నుల బకాయిలను చెల్లించకపోతే ఆస్తుల జప్తు చేయబడుతుందని, నీటి పంపు కనెక్షన్ తొలగించడం జరుగుతుందని హెచ్చరించారు.

ఆటో డ్రైవర్‌పై కేసు నమోదు

పాల్వంచరూరల్: ప్రమాదవశాత్తు ఆటో చెట్టును ఢీకొట్టిన ప్రమాదంలో నలుగురికి గాయాలయ్యాయి. ఈ మేరకు మంగళవారం ఆటోడ్రైవర్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు... మండలంలోని మందిరేకలపాడు గ్రామ సమీపంలో ఈనెల 16న ఉల్వనూరు నుంచి పాల్వంచ వైపు వస్తున్న ఆటో మూలమలుపు వద్ద ప్రమాదానికి గురైంది. అందులోని పాల్వంచ పట్టానికి చెందిన రాజు, ఉదయ్, ఆనంద్‌లతోపాటు ఆటో డ్రైవర్ కోటేశ్వరరావు గాయపడ్డారు. ఆటో ప్రమాదానికి గురికావడంతో దెబ్బతిన్నదని ఆటో ఓనర్ భానుమతి ఫిర్యాదు మేరకు మంగళవారం డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ బి.శ్రీనివాస్ తెలిపారు.

ఎంపీ టికెట్ బెల్లయ్యకు కేటాయించాలి



మాట్లాడుతున్న రమేష్ నాయక్

కొత్తగూడెంటౌన్: రానున్న లోక్‌సభ ఎన్నికల్లో మహబూబాబాద్ కాంగ్రెస్ టికెట్ బెల్లయ్య నాయక్‌కు ఇవ్వాలని ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు బానోతు రమేష్‌నాయక్ డిమాండ్ చేశారు. మంగళవారం కొత్తగూడెంలో మాట్లాడుతూ... ఏఐసీసీ ఆదివాసీ కాంగ్రెస్ చైర్మన్ అయిన బెల్లయ్యనాయక్ సేవలను పార్టీ గుర్తించాలని కోరారు. సమావేశంలో లావుడ్యా రమేష్‌నాయక్, బాలాజీ నాయక్, మంగీలాల్ నాయక్, మోహన్‌నాయక్, ప్రసాద్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు..

మాజీ సర్పంచ్ మృతికి సంతాపం

జూలూరుపాడు: రామచంద్రాపురం గ్రామానికి చెందిన గుండెపుడి మాజీ సర్పంచ్, సీపీఐ నాయకుడు ఈసం నర్సింహ అనారోగ్యంతో మంగళవారం మృతి చెందాడు. ఈ మేరకు ఆయన మృతదేహం వద్ద సీపీఐ నాయకుడు చంద్ర నరేంద్రకుమార్, గుండెపిన్ని వెంకటేశ్వర్లు, ఎస్కే నాగుల్‌మీరా, యల్లంకి మధు, చింతా స్వరాజ్‌రావు, ఎస్కే చాంద్‌పాషా, వలమల్ల సామేలు, పొన్నెకంటి వెంకటేశ్వర్లు, తూము కోటయ్య, రాములు నివాళులర్పించి, సంతాపం తెలిపారు.

మద్యం దందాపై చర్యలేవి?



మాట్లాడుతున్న కామేశ్

పాల్వంచ: రెండు రోజులుగా జిల్లాలో ఎక్సైజ్ టాస్క్ ఫోర్స్ సిబ్బంది నిర్వహించిన దాడులు లోపభూయిష్టంగా జరిగాయని బీఎస్పీ పార్లమెంట్ ఇన్‌చార్జ్ యెర్రా కామేశ్ ఆరోపించారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. కొత్తగూడెం నియోజకవర్గంలో జరుగుతున్న మద్యం సిండికేట్ దందాపై జిల్లా అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదన్నారు. టాస్క్ ఫోర్స్ దాడుల విషయాన్ని సిండికేట్ వ్యాపారులకు ముందస్తుగానే సమాచారం ఇచ్చారని విమర్శించారు. కేవలం ఒక్కషాపుకు మాత్రమే జరిమానా విధించి చేతులు దులుపు కున్నారని ఆరోపించారు. సమావేశంలో జెట్టి ఆనందరావు, రంజిత్, ప్రవీణ్, సందీప్, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన కేపీఎల్ క్రికెట్ టోర్నీ



విన్నర్ జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య

టేకులపల్లి: కోరం కనకయ్య ప్రీమియర్ లీగ్ (కేపీఎల్ సీజన్1, మూడు నవీన్ మెమోరియల్) టేకులపల్లి మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్ మంగళవారం ముగిసింది. ఈనెల 6న ప్రారంభమైన ఈ టోర్నమెంట్‌లో 50 జట్లు తలపడ్డాయి. ఫైనల్ మ్యాచ్‌లో ఏజే11 (సంపత్‌నగర్) జట్టు కేకే కేఎస్ఆర్ యూత్ విజయం సాధించింది. మొదటి బహుమతి రూ.30వేలు, రన్నర్ జట్టుకు రూ.20వేలు, షీల్డులు, ఓవరాల్ బెస్ట్ బ్యాట్స్‌మెన్ భాను, ఓవరాల్ ఆల్‌రౌండర్ గోపాల్‌కు షీల్డ్‌లను ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అందజేశారు. కార్యక్రమంలో టేకులపల్లి, బోడు ఎస్ఐలు షేక్ సైదా రహూఫ్, పి.శ్రీకాంత్, నిర్వాహకులు, నాయకులు, పూనెం సురేందర్, బానోతు సక్రు, బోడ మంగీలాల్ నాయక్, మూడు గణేష్ చౌహాన్, మూడు సంజయ్, బోడ సరిత, భూక్యా నాగేశ్వరరావు, నోముల భాను, అశోక్, విజయ్, కత్తుల అఖిల్, డీజే సురేందర్, బానోతు రవి, చంటి పాల్గొన్నారు.